వడివడిగా ఖరీఫ్ వరి నాట్లు

ఖరీఫ్ వరి నాట్లు వడివడిగా సాగుతున్నాయి. బోర్ల సదుపాయం, అడపా దడపా కురుస్తున్న వర్షాలు, కాలువ, మురుగు బోదెల్లో ఉన్న నీటి సదుపాయంతో రైతులు వరి నారుమడులను సిద్ధం చేసుకున్నారు. ప్రస్తుతం పెనమలూరు నియోజకవర్గంలోని పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు మండలాల్లో చాలా గ్రామాల్లో పొలాలను దమ్ము చేసి వరి నాట్లు వేస్తున్నారు. తెలంగాణ, దివిసీమ ప్రాంతాల నుంచి వలస కూలీల రాకతో వరి నాట్లు ఊపందుకుంటున్నాయి. వరి నాట్లు, భూముల యాజమాన్య చర్యలతో అటు రైతులు, ఇటు కూలీలు బిజీగా ఉన్నారు. – కంకిపాడు



ఈడుపుగల్లులో కళకళలాడుతున్న వరి నారుమడి



పునాదిపాడులో ట్రాక్టర్‌తో దమ్ము చేస్తున్న రైతు



దావులూరులో వరి నాట్లు వేసిన పొలాలు



చలివేంద్రపాలెం పరిధిలో నాట్లు వేస్తున్న కూలీలు

క్లుప్తంగా

ఆస్పత్రులకు వెళ్లి పింఛన్ అందజేత



ఉంగుటూరు: వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న లబ్ధిదారుల వద్దకు వెళ్లి పింఛన్ నగదును అందజేసిన సచివాలయ సిబ్బందిని పలువురు అభినందించారు. చిన్న అవుటపల్లిలోని పిన్నమనేని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న డొంకాడ రంగమ్మకు ఉంగుటూరు సచివాలయ గ్రేడ్-5 కార్యదర్శి నాగరాజు పింఛన్ అందజేశారు. అలాగే మచిలీపట్నంలో చికిత్స పొందుతున్న జంగం జ్యోతికి ఇంజినీరింగ్ అసిస్టెంట్ శివనాగరాజు పింఛన్ నగదు రూ.7 వేలను అందజేశారు. పలు గ్రామాల్లో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న లబ్ధిదారులకు పింఛన్ అందజేసిన సచివాలయ సిబ్బందిని ఎంపీడీఓ మహేశ్వరరావు, కార్యదర్శి నర్రా ప్రసాద్, సర్పంచ్ వర ప్రసాద్ అభినందించారు.

మోడల్ డ్రైవింగ్ స్కూల్‌ను సందర్శించండి

జిల్లా కలెక్టర్‌ను కోరిన లారీ యజమానుల సంఘం



లబ్బీపేట(విజయవాడతూర్పు): ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం ఇటీవల జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన జి.సృజనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తేలప్రోలు సమీపంలోని అంపాపురంలో 20 ఎకరాల విస్తీర్ణంలో అన్ని వసతులతో అసోసియేషన్ ఆధ్వర్యంలో 2005లో ఏర్పాటు చేసిన దేశంలోనే అతిపెద్దదైన మోడల్ డ్రైవింగ్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ అండ్ రీసెర్చ్ సెంటర్‌ను సందర్శించాల్సిందిగా కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నాగమోతు రాజా, ఉపాధ్యక్షుడు కాజ వెంకట సత్య చలపతిరావు, ప్రధాన కార్యదర్శి అల్లాడ వీర వెంకట సత్యనారాయణ, కార్యదర్శి రావి శరత్‌బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వైవీ ఈశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఆదాయ పన్ను చెల్లించడం ఉద్యోగుల బాధ్యత

డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ప్రతి ఉద్యోగి తప్పనిసరిగా ఆదాయ పన్ను చెల్లించి దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని విజయవాడ రైల్వే డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్ అన్నారు. ఆదాయ పన్ను శాఖ, విజయవాడ రైల్వే డివిజన్ సంయుక్త ఆధ్వర్యంలో రైల్వే ఆడిటోరియంలో ఆదాయ పన్నుపై ఉద్యోగులు, పెన్షనర్లకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డీఆర్‌ఎం మాట్లాడుతూ చాలామంది ఆదాయ పన్ను దాఖలు చేయడంలో ఇతర వ్యక్తులపై ఆధారపడుతున్నారన్నారు. కొద్దిపాటి అవగాహన కలిగి ఉంటే ఇది ఏమాత్రం కష్టతరం కాదన్నారు. ఆదాయ పన్ను నిబంధనలను చదివి వాటిని అర్థం చేసుకుంటే పన్నులను సులభంగా సొంతంగానే ఫైలింగ్ చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు పన్నులు ఫైలింగ్ చేసే క్రమంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. పన్నుల ఎగవేతకు దారితీసే ఎలాంటి తప్పులు లేకుండా చూసుకోవాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆదాయ పన్ను శాఖ జాయింట్ కమిషనర్ ఎన్.అభినయ మాట్లాడుతూ దేశ ఆదాయంలో ఆదాయ పన్నుల సేకరణ కీలకమైనప్పటికీ సరైన అవగాహనతో సులభ పద్ధతిలో పన్నులు చెల్లించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా ఆదాయ పన్ను నిబంధనలు, పరిజ్ఞానం, పన్ను చట్టాలు, పన్ను తగ్గింపులు, మినహాయింపులు, తప్పుడు క్లెయిమ్స్ తదితర విషయాలపై పూర్తి అవగాహన కల్పించినట్టు చెప్పారు. అనంతరం ఆదాయ పన్ను శాఖ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆదాయ పన్ను దాఖలు, పన్ను ప్రయోజనాలు, తగ్గింపులు, రిఫండ్ స్కామ్‌లు, రెడ్ ఫ్లాగ్ తదితర అంశాలపై మార్గనిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం కె.శ్రీనివాస్, సీనియర్ డీఎఫ్‌ఎం ఈ.శివరామకృష్ణ, సీనియర్ డీపీఓ కట్టా ఆనంద్, సీనియర్ డీఎంఓ రవికుమార్, ఆదాయ పన్ను శాఖ అడిషనల్ కమిషనర్లు డి.విజయ్‌బాబు, ఆర్.చాముండేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై పచ్చిరొట్ట, వరి విత్తనాల పంపిణీ

గన్నవరం రూరల్: మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో పచ్చిరొట్ట విత్తనాలు, వరి విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు ఎంఏవో ఎస్ఎల్ తేజస్వి చెప్పారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువులు ఇప్పటికే రైతులకు సబ్సిడీపై అందించామన్నారు. పిల్లి పెసర 30, జనుము 37 క్వింటాళ్లు సరఫరా చేశామన్నారు. వరి విత్తనాలు ఎంటీయూ 1318 రకం 150 క్వింటాళ్లు, ఎంటీయూ 1061 విత్తనాలు 100 క్వింటాళ్లు అందజేశామని చెప్పారు.

అభయాంజనేయస్వామి సన్నిధిలో అన్నదానం

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం విశేష పూజలు, అన్నదానం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి హనుమంతుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అభయాంజనేయునికి తమలపాకులతో ప్రత్యేక పూజలు వైభవంగా జరిగాయి. అనంతరం ఆలయ ప్రాంగణంలో 200 మంది భక్తులకు రాధాకృష్ణ భజన సమాజం(కొయ్యూరు) సహకారంతో అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయ ఈఓ కూచిపూడి శ్రీనివాస్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

నున్న(విజయవాడరూరల్): వాతావరణంలో వస్తున్న మార్పులను దృష్టిలో పెట్టుకొని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి జి.టి.వి.రమణ సూచించారు. గ్రామ ఉప సర్పంచ్ కలకోటి బ్రహ్మానందరెడ్డి అధ్యక్షతన పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం గ్రామ సభ జరిగింది. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ.. అంటువ్యాధులు సోకకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మెయిన్ రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీల్లోని చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని చెప్పారు. గ్రామంలో పలు చోట్ల రోడ్లు, డ్రెయినేజీ కాల్వలు నిర్మించాల్సి ఉందన్నారు. అయితే నిధులు సౌలభ్యం ఉపాధి గ్రాంటు రావాలన్నారు. ఎస్టీ కాలనీ వాసులకు శ్మశానవాటిక ఏర్పాటు చేయాలని స్థానికులు వినతిపత్రం అందజేశారు. ఎస్టీ కాలనీలో రోడ్లు, డ్రెయినేజీ కాల్వలు అధ్వానంగా ఉన్నాయని ఆ కాలనీ వాసులు పలువురు గ్రామసభ దృష్టికి తీసుకువచ్చారు. కాలనీలో డ్రెయినేజీ కాల్వలు పల్లంగా ఉండడంతో మురుగు పారే పరిస్థితి లేదన్నారు. దీంతో అనేక వ్యాధులు ప్రబలుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్లు కూడా ధ్వంసమై నడవడానికి వీలు లేకుండా ఉన్నాయని కాలనీ వాసులు తెలిపారు. ఏఎన్‌ఎం లక్ష్మి డయేరియా లాంటి వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. గ్రామ సభలో ఎంపీటీసీ సభ్యుడు ప్రత్తిపాటి రవీంద్ర, పంచాయతీ పాలకవర్గ సభ్యులు కాటూరి శ్రీనివాసరావు, గంపా శ్రీనివాసరావు, ప్రత్తిపాటి సుందరయ్య, యర్కారెడ్డి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గ్రామ సభలో మాట్లాడుతున్న కార్యదర్శి రమణ

పరిశోధనా రంగాల్లో మహిళల పాత్ర పెరగాలి



మాట్లాడుతున్న ఆచార్య ఉపాసనా బోరా సింహా

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పరిశోధనా రంగాల్లో మహిళల భాగస్వామ్యం మరింత పెరగాలని నాగాలాండ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఆచార్య ఉపాసనా బోరా సింహా అన్నారు. కేబీఎన్ కళాశాల పీజీ రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'ఎస్టీఈఎం పరిశోధనల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంచే వ్యూహాలు' అంశంపై సదస్సును మంగళవారం కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా హాజరైన ఆచార్య ఉపాసనా బోరా సింహా మాట్లాడుతూ వివిధ రంగాల్లో పరిశోధనలు చేసేందుకు ముందుకు వస్తున్న మహిళల సంఖ్య చాలా తక్కువగా ఉంటుందన్నారు. ప్రధానంగా విద్యారంగంలో మహిళల సంఖ్య పెరిగినా ఆ మేర పరిశోధనల్లో కనపడటం లేదన్నారు. ఇది సరైనది కాదని అభిప్రాయపడ్డారు. మహిళలు పరిశోధనల్లో పాల్గొనేందుకు, రాణించేందుకు ప్రభుత్వానికి చెందిన వివిధ విభాగాలు అనేక అవకాశాలను కల్పిస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా సామాజిక చైతన్యానికి మానవ వికాసానికి సైన్స్ అండ్ టెక్నాలజీ, మ్యాథ్స్, ఇంజినీరింగ్ విభాగాల్లో మరిన్ని ఆవిష్కరణలు రావాల్సిన అవసరాన్ని ఆమె వివరించారు. సదస్సుకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ మహిళల భాగస్వామ్యం పెరిగినప్పుడు సమాజానికి మరింత మేలు జరుగుతుందన్నారు. పరిశోధనా రంగాల్లో ఉన్న అవకాశాలను మహిళలు పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలన్నారు. ఆ దిశగా అవగాహనను పెంచుకోవాలని సూచించారు. ఆయా రంగాల్లో ఉన్న ఉపాధి అంశాలను సైతం పరిశీలించాలని కోరారు. కార్యక్రమాన్ని రసాయనశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ జి.కృష్ణవేణి నిర్వహించగా పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు డైరీల అందజేత

పెనమలూరు: విద్యార్థులు కృషి, పట్టుదలతో లక్ష్యం చేరుకోవాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యా దాత కిలారు శివకుమార్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, సాగర్ సిమెంట్ సహకారంతో రూ.7 లక్షల విలువ చేసే 13 వేల డైరీలు ఆవిష్కరించి ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాల విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రసాద్ మాట్లాడుతూ.. విద్యార్థులు పాఠశాలల్లో ఉన్న వనరులతో పాటు దాతల సాయంతో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. విద్యార్థులు సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లింగాల భాస్కరరావు, విద్యా దాత కాలారు శివకుమార్, పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కిలారు బసవపున్నయ్య, కిలారు సత్యనారాయణ, సాగర్ సిమెంట్ ఏపీ హెడ్ నారాయణరావు, టీడీపీ నాయకులు మారుపూడి ధనకోటేశ్వరరావు, కోయా ఆనంద్, సీహెచ్.శ్రీనివాసరావు, హెచ్‌ఎం వై.దుర్గాభవాని, మూడు మండలాల విద్యా శాఖాధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పెనమలూరులో డైరీలు చూపుతున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తదితరులు

మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు చేపట్టండి

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. పోరంకిలోని తన కార్యాలయంలో మంగళవారం మున్సిపాలిటీ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. కానూరు మహదేవపురం కాలనీ, అమరావతి కాలనీ, యనమలకుదురు, పోరంకి ప్రాంతాల్లో రోడ్లు, డ్రెయినేజీ పనులు చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపర్చాలన్నారు. యనమలకుదురులో పారిశుద్ధ్య కార్మికులు పూర్తి స్థాయిలో లేకపోవటంతో సమస్యలు తలెత్తుతున్నాయని టీడీపీ నేత వెలగపూడి బాబురావు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.

కుళాయి పన్నులపై కసరత్తు

తాడిగడప మున్సిపాలిటీలో గత నాలుగు సంవత్సరాలుగా కుళాయి పన్నులు విధించలేదు. దీంతో బకాయిగా ఉన్న కుళాయి పన్నులు వసూళ్లపై సమీక్షలో చర్చించారు. కుళాయి పన్నులు 4 సంవత్సరాలవి వసూళ్లు చేస్తే నివాసితుల నుంచి భారీగా నీటి పన్నులు వసూళ్లు చేసే అవకాశం ఉందన్నారు. సమావేశంలో కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు దోనేపూడి రవి, శుభశేఖర్, రామ్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.



తాడిగడపలో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ప్రసాద్

పెన్షనర్ల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలి

గన్నవరం: విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక బుద్ధవరం రోడ్డులోని విశ్రాంత ఉద్యోగుల సేవా భవన్‌లో విశ్రాంత ఉద్యోగుల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. విశ్రాంత ఉద్యోగులకు సకాలంలో పెన్షన్ నగదును ప్రభుత్వం జమ చేయాలని కోరారు. ప్రభుత్వం నుంచి పెన్షనర్లకు రావాల్సిన బకాయిలను కూడా వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అందరూ సమష్టిగా పని చేయాలని సూచించారు. సంఘం జిల్లా కార్యదర్శి ఆశీర్వాదం, గన్నవరం యూనిట్ అధ్యక్షుడు ఎ.మోహన్‌రావు, అసోసియేట్ అధ్యక్షులు కేవీ పాపారావు, ఎస్.బసవేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి వల్లిసాహెబ్, ఉపాధ్యక్షులు బి.కోటేశ్వరరావు, సుబ్బారావు, వై.రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్

పారదర్శకంగా ఇంటి పన్ను వివరాలు

నున్న(విజయవాడరూరల్): గ్రామాల్లో ఇంటి పన్ను వివరాలను పారదర్శకంగా ఉంచాలని విజయవాడ డివిజనల్ పంచాయతీ అధికారి(డీఎల్పీఓ)భమిడి శివమూర్తి అన్నారు. మంగళవారం ఆయన ప్యూరిఫికేషన్ ఆఫ్ హౌస్ ట్యాక్స్ పరిశీలనలో భాగంగా ఇంటి పన్ను వివరాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నున్న గ్రామంలో 4,600 అస్సెస్మెంట్లు ఉన్నాయని, ఆ వివరాలు పోర్టల్‌లో ఉంచాలని సిబ్బందికి చెప్పారు. అధికారులు రికార్డుల పరిశీలనకు వచ్చినప్పుడు తేలిగ్గా వాటిని తెలుసుకునేలా అందుబాటులో ఉంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం పోర్టల్‌ను నిర్వహిస్తోందన్నారు. ప్రతి 15 రోజులకోసారి మంచినీటి ట్యాంక్‌లను శుభ్రం చేయాలని చెప్పారు. ట్యాంకులు శుభ్రం చేసిన తేదీల వివరాలను కూడా ట్యాంక్‌పై రాయాలన్నారు. ప్రైవేట్ వ్యక్తులు నిర్వహిస్తున్న ఆర్వో వాటర్ ప్లాంట్లలో నీటి పరీక్షలు జరిగేలా చూడాలన్నారు. మాంసం దుకాణాల వద్ద డాక్టర్లచే జంతువులు ఆరోగ్య పరీక్షలు నిర్వహించిన పిమ్మట మాంసం విక్రయాలు జరిపించాలని చెప్పారు. ప్రస్తుతం జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రజలు డయేరియా, ఇతర వ్యాధుల బారిన పడి అవస్థలు పడుతున్నారని, అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజారోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



నున్న పంచాయతీలో పన్ను వివరాలను పరిశీలిస్తున్న డీఎల్పీఓ శివమూర్తి

30న మండల స్థాయి చెస్ పోటీలు

గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఈ నెల 30వ తేదీన మండల స్థాయిలో జెడ్పీ హైస్కూళ్ల విద్యార్థులకు చెస్ పోటీలను నిర్వహించనున్నట్లు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఆర్ కిషోర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఎనిమిది జెడ్పీ హైస్కూళ్లతో పాటు ఉంగుటూరు మండలం పెద్దఅవుటపల్లి హైస్కూల్స్ నుంచి ఇద్దరు చొప్పున విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థుల వివరాలను వాకర్స్ అసోసియేషన్‌కు తెలియజేయాలని సూచించారు. ఇతర సమాచారానికి 94907 98909 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

● గుంతలు... ప్రమాదాల నెలవులు !

జవహర్ ఆటోనగర్‌లోని పలు ప్రాంతాల్లో రహదారులు గుంతలమయంగా మారాయి. వర్షాల కారణంగా ఈ గుంతల్లోకి నీరు చేరి రాకపోకలకు ఇబ్బందికరంగా మారాయి. పటమట పోలీస్ స్టేషన్, డిస్పోజల్ రోడ్డు, కాటా సెంటర్ లోని పలుచోట్ల రహదారులపై ఉన్న గుంతలతో వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. కొన్ని చోట్ల గుంతల్లో తాత్కాలికంగా గోతాలు వేశారు. వీటి కారణంగా ఇంకా ప్రమాదాలు అధికంగా జరిగే అవకాశాలు ఉన్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత ఐలా అధికారులు వెంటనే స్పందించి గుంతలు పూడ్చి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. -ఆటోనగర్(విజయవాడ తూర్పు)



ఆటోనగర్‌లో గుంతలమయంగా రహదారి



స్టార్ రోడ్డు సమీపంలో ఇలా...



మూడవ రోడ్డు వెళ్లే జంక్షన్ వద్ద పరిస్థితి



డిస్పోజల్ మెయిన్ రోడ్డులో ఇలా...

భవనంపై నుంచి పడి బాలుడి మృతి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): భవనంపై నుంచి కింద పడి గాయాలపాలైన బాలుడు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళితే వన్‌టౌన్ పల్లెవీధిలో మహావీర్ జైన్ కుటుంబం నివాసం ఉంటోంది. ఆయనకు ఒక కుమార్తె, ఒక కుమారుడు సంభవ్‌జైన్ (15) ఉన్నారు. పదో తరగతి చదువుతున్న సంభవ్‌జైన్ సోమవారం ఉదయం పాఠశాలకు వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చాడు. సాయంత్రం ఐదున్నర గంటలకు ఇంటిపై అంతస్తుకు ఆడుకునేందుకు వెళ్లాడు. కొద్దిసేపటికి ఎదురింటి వ్యక్తి బిగ్గరగా అరుస్తూ మహావీర్‌జైన్‌ను పిలిచి మీ అబ్బాయి భవనం పైనుంచి కిందకు పడిపోయాడని చెప్పాడు. దాంతో మహావీర్‌జైన్ కిందకు వచ్చి ఆటోలో తీవ్ర గాయాలతో ఉన్న తన కుమారుడిని సూర్యారావుపేటలోని ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. బాలుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

